క్లుప్తంగా

రెండో రోజుకు చేరిన దీక్షలు

కడ్తాల్: 765 కేవీ బీదర్–మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్ మార్చాలని చేపట్టిన దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చే వరకు ఉద్యమం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ దీక్షలో వెంకటరాములుగౌడ్, పెంటారెడ్డి, వెంకటేశ్, నరేశ్, మహిళా రైతు బక్కమ్మ కూర్చున్నారు. ఈ దీక్షలకు రైతు సంఘం నాయకులు రామకృష్ణ, రాజేందర్‌యాదవ్, మహేశ్, కృష్ణ, నర్సింహగౌడ్, రాములు తదితరులు సంఘీభావం తెలిపారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

లయన్స్ క్లబ్ ఆఫ్ వనస్థలిపురం అధ్యక్షుడు నందకిషోర్



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు

తుర్కయంజాల్: పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడు ముందుంటుందని లయన్స్ క్లబ్ ఆఫ్ వనస్థలిపురం అధ్యక్షుడు ఎస్‌జేఎస్ నందకిషోర్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్‌లోని వెంకటేశ్వర హచరీస్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ.. రోగులందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. సుమారు 250 మంది వైద్య సేవలు పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.రవీందర్ రెడ్డి, జి.నరసింహులు, డాక్టర్ నవీన్, డాక్టర్ సురేశ్, అల్వాల్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వినాయక నిమజ్జనం


లడ్డూను దక్కించుకున్న గోపాల్‌గౌడ్, మహేశ్

ఇబ్రహీంపట్నం: డివిజన్ పరిధి శ్రీరాంనగర్ కాలనీలో జీఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. నిమజ్జనం సందర్భంగా ఫోక్ సింగర్ మధుప్రియ, ఆస్కార్ విజేత రాహుల్ సిప్లిగంజ్, బాలీవుడ్ సింగర్స్ నిర్మల రాథోడ్, ఉషారాణి బృందం ఆటపాటలతో భక్తులను ఆకట్టుకున్నారు.

రికార్డు స్థాయిలో లడ్డూ వేలం

ఇబ్రహీంపట్నం చరిత్రలో రికార్డు స్థాయిలో వినాయక లడ్డూ వేలం కొనసాగింది. ఆదిబట్లకు చెందిన పల్లె గోపాల్‌గౌడ్ పెద్ద లడ్డూను 8.50లక్షలకు దక్కించుకోగా, చిన్న లడ్డూను ఇబ్రహీంపట్నంకు చెందిన మహేశ్ రూ.3లక్షలకు కైవసం చేసుకున్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

మాడ్గుల: విద్యావ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఉపాధ్యాయుల తీరుతో ఈ లక్ష్యం నీరుగారుతోంది. మండల పరిధిలోని చంద్రయాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. మంగళవారం ఏ ఒక్కరు విధులకు హాజరుకాకపోవడంతో విద్యార్థులు ఆరుబయట ఆటలాడుతూ కనిపించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆవిర్భావ దినోత్సవానికి తరలిరండి

పూసల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం

ఇబ్రహీంపట్నం: సంచార జాతుల సంఘం ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని పూసల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నూతనగంటి పురుషోత్తం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంచారజాతులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

నీటి బిల్లు రద్దుకు వినతి

ఎల్‌బీనగర్: నూతన భవనాలకు అధికంగా నీటి బిల్లులను వేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సిరెడ్డి అన్నారు. హయత్‌నగర్ శ్రీనివాస్ కాలనీలో నూతన భవనాలకు రూ.600–రూ.2 వేల వరకు నీటి బిల్లులు వేసున్నారని వాటిని వెంటనే అరికట్టాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో జలమండలి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

బై‘పాస్’

పదేళ్లుగా మట్టి రోడ్డే దిక్కు

- మాల్ వ్యాపార కేంద్రంలో నిత్యం వాహనాల రద్దీ
- తక్కళ్లపల్లి కల్వర్టు వద్ద ప్రమాదాలు
- మాల్–చింతల్లి మార్గాన్ని అభివృద్ధి చేయాలని వినతులు


బీటీ రోడ్డుకు నోచుకోని బైపాస్ మట్టి రోడ్డు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ మార్గంలోని మాల్ వ్యాపార కేంద్రం నిత్యం రద్దీగా ఉంటుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు నిత్యం ఏపీలోని గుంటూరు, మాచర్ల, కనిగిరి, మార్కాపురం, నర్సరావుపేట తదితర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ తదితర ప్రాంతాలకు వీఐపీలు ఈ రహదారిపై నుంచే రాకపోకలు సాగిస్తారు. మాల్ వ్యాపార కేంద్రానికి జిల్లా వాసులతో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి నిత్యం వేలాది మంది రైతులు, కూలీలు, వ్యాపారులు కావాల్సిన సరుకులు, వ్యవసాయ పనిముట్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. సంత జరిగే మంగళవారం మరింత రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ నిత్యం రూ.కోట్లలో ఆర్థిక వ్యాపార లావాదేవీలు కొనసాగుతుంటాయి.

ఐదేళ్లుగా ఫిర్యాదులు

పదేళ్ల క్రితం కృష్ణాజలాల మూడో పైపు లైన్ ఏర్పాటు సమయంలో నాగార్జునసాగర్ హైవేపై మాల్ శివారు నుంచి నల్గొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని గొడుకొండ్ల పరిధిలోని కృష్ణాజలాల రిజర్వాయర్ వరకు బైపాస్ ఏర్పాటు చేశారు. ఈ మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చితే ప్రైవేటు వాహనాలు అదే మార్గంలో వెళ్లడంతో మండల కేంద్రంలో వాహనాల తాకిడి తగ్గుతుందని పలువురు సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని ఇరు జిల్లాల ప్రజా ప్రతినిధులు ఐదేళ్లుగా కలెక్టర్లకు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. ఇటీవలే స్థానికులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లారు.

డేంజర్ స్పాట్ ః తక్కళ్లపల్లి కల్వర్టు

సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి కల్వర్టు వద్ద ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ కల్వర్టు వద్దకు వాహనాలు వచ్చే వరకు దిమ్మెలు కనిపించవు. గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కార్లు, బైక్‌లు, లారీలు అదుపు తప్పి వాగులో పడిపోయిన ఘటనలు అనేకం. కల్వర్టును మరమ్మతులు చేయాలని పలుమార్లు స్థానికులు, ప్రయాణికులు రోడ్డు భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసిన స్పందన లేదు. ప్రయాణికుల ప్రాణాలు పోతే గాని వారిలో స్పందన వచ్చేటట్టు కనిపించడం లేదు. మాల్–ఇబ్రహీంపట్నం రోడ్డు సైతం గుంతలమయంగా మారింది.

అటుగా వెళ్లడం లేదు


మాల్ శివారులో ఉన్న బైపాస్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చితే ప్రయాణికుల రాకపోకలకు సులభం అవుతుంది. ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగి ప్రయాణికులు అటుగా వెళ్లడం లేదు. దొంగలుంటున్నారనే ప్రచారం సైతం ఉంది. బీటీ రోడ్డుగా మార్చి వినియోగంలోకి తెచ్చేలా చూడాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరాం.

– బట్టు శ్రీనివాస్ ముదిరాజ్, మాల్

బీటీగా మార్చాలి


కృష్ణాజలాల పైపు లైను నిర్మాణం కోసం రైతులు విలువైన వ్యవసాయ భూములు ఇచ్చారు. ప్రస్తుతం ఆ భూముల ధరలు రూ.కోట్లల్లోనే ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి మాల్ బైపాస్ రోడ్డును వెంటనే బీటీ రోడ్డుగా మార్చాలి. అప్పుడే భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేసినట్లు అవుతుంది.

– లిక్కి జంగారెడ్డి, రైతు, కిషన్‌పల్లి

నివేదిక ఇస్తాం


మాల్ శివారులోని బైపాస్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు కావాల్సిన నిధుల మంజూరుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి నివేదిక ఇస్తాం. బైపాస్ రోడ్డు బీటీ అయితే వాహనాల రాకపోకలు సులభంగా వెళ్లే అవకాశం ఉంది. వ్యాపార పరంగా మరింత అభివృద్ధి అవుతుంది.

– రాధారాణి, ఎంపీడీఓ, యాచారం

తలనీలాల సేకరణకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత శివరామాలయ దేవస్థానం ప్రాంగణంలో, తలనీలాల సేకరణ హక్కులకు మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. అక్టోబర్ 1 నుంచి 2026 సెప్టెంబర్ వరకు, ఆలయ ప్రాంగణంలో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ హక్కులకోసం నలుగురు వేలంలో పాల్గొన్నారు. ఏపీలోని గుంటూరు జిల్లా దాచాపల్లి గ్రామానికి చెందిన వజ్రపు రామయ్య రూ.2.26లక్షలకు తలనీలాల సేకరణ హక్కును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి రామ్మోహన్‌రావు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఆలయ ఈఓ స్నేహలత, ఉప ప్రధాన అర్చకులు యాదగిరి, సిబ్బంది కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే ఊరుకోం


మాట్లాడుతున్న నర్సింహ

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ

ఆమనగల్లు: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై ఆరోపణలు తగవని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో పార్టీ నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి ప్రభుత్వమన్నారు. ట్రిపుల్ ఆర్ విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూస్తుందన్నారు. ట్రిపుల్ ఆర్ ప్రతిపాదనలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రకటించిన అలైన్‌మెంట్ విషయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఎలాంటి ప్రమేయం లేదని చెప్పారు. తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్, అతని అనుచరులు ఎమ్మెల్యేపై విమర్శలు చేయిస్తున్నారని ఆరోపించారు. అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతులు తొందరపడవద్దని సూచించారు. విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, సీనియర్ నాయకులు ఖలీల్, మల్లయ్య, బాలరాజు, అలీం, కృష్ణాయాదవ్, శేఖర్‌గౌడ్, చంద్రయ్య, మహేశ్, విజేందర్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ తదితరులు ఉన్నారు.

సాగుకు సరిపడా యూరియా ఇవ్వండి

సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి


డీఏఓ ఉషకు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: రైతులకు సకాలంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం సాగుకు సరిపడా అందించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళశారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి ఉషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల్లో రైతులు సాగు చేసిన పంటలకు అనుగుణంగా యూరియా అందడం లేదని ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. యూరియా సకాలంలో అందక, వేసిన పంటలు దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. రైతులకు సరిపడా యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, వెంకటేశ్, పర్వత్‌కుమార్ యాదవ్, అభిషేక్‌రెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.

సౌకర్యాల కల్పనకు వినతి


మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పట్టణవాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: తమ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ వాసులు మంగళవారం ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను కోరారు. ఈ మేరకు వారు మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంగరకలాన్ 8వ వార్డులో ఎస్‌బీఐ బ్యాంకు పక్క బస్తీలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. యూజీడీ సౌకర్యం లేక రోడ్లపైనే మురుగు పారుతుందన్నారు. కొత్త కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి డీఈని పంపి పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రవీందర్, వసంత, రాజేశ్వరి, నిరంజన్‌గౌడ్, స్వప్న, హేమంత్‌రెడ్డి, కృష్ణ, పద్మ, సుశీల తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మంచాల: సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి తదితరులు

మంచాల: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. లోయపల్లి అభివృద్ధిలో భాగంగా లోయపల్లి–దుబ్బగడ్డ తండా వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.4.90 కోట్లు, సల్లిగుట్ట తండా–అంతంపేట వరకు రూ.1.90 కోట్లు, లోయపల్లిలో అంగన్ వాడీ భవనం నిర్మాణంకు రూ.12లక్షలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి రూ.10 లక్షలు, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం లోయపల్లి కాంగ్రెస్ నాయకులు నగరంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పనులు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారింగ్ జంగయ్యగౌడ్, మోతీరాం నాయక్, మిద్దె శ్రీనివాస్ నాయక్, చెరుకు సత్యనారాయణ, దండేటికార్ మహేందర్‌జీ, యాదయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

గ్రామాల అభ్రివద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరుట్లలో ఎమ్మెల్యే నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల మౌలిక అవసరాలను గుర్తించి ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కురుమ కులస్తులు గ్రామంలోని బీరప్ప ఆలయం వరకు రోడ్డు వేయాలని కోరగా ఆయన నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేశ్, కాంగ్రెస్ నాయకులు యాదయ్య, శ్రీనివాస్, పండరీనాథ్, శ్రీకాంత్, నర్సింహగౌడ్, లక్ష్మణ్, గుడ్డిమల్ల చంద్రయ్య, బుగ్గరాములు, మార సురేశ్, మాసయ్యగౌడ్, రాజుగౌడ్, కురుమ సంఘం నాయకులు బీరప్ప, రఘుపతి, జంగయ్య, శివ, బీరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నం రూరల్: లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయం చుట్టూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీసీ రోడ్డు వేయడం హర్షనీయమని కాంగ్రెస్ నాయకులు రమేశ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో పెరుమాండ్ల హనుమాన్ ఆలయం నుంచి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, మధుసూదన్, నర్సింహారెడ్డి, భూపాల్‌రెడ్డి, మహేశ్, హరిబాబు, శేఖర్, మాజీ సర్పంచ్‌లు శేఖర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ రచనలతో ప్రజా చైతన్యం


ఆమనగల్లు: కాళోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ శంకర్


తుర్కయంజాల్: మున్సిపల్ కార్యాలయంలో..

ఆమనగల్లు: తన కవిత్వం, రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని మున్సిప్ కమిషన్ శంకర్ అన్నారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, టీపీఓ వరప్రసాద్, సిబ్బంది ఉపేందర్‌రెడ్డి, అప్రోజ్, రమేశ్‌నాయక్, రామకృష్ణ, షరుద్దీన్, శ్రవణ్, మనీష తదితరులు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకులకు సన్మానం

ఇబ్రహీంపట్నం: తెలుగు భాష దినోత్సవాన్ని సందర్భంగా మంగళవారం ఇబ్రహీంపట్నం బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ముందుగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగు అధ్యాపకులు సునీత, మంజుల, యశోదలను పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు వర్కాల పరమేశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. జీఆర్ ఫ్రెండ్స్ వినాయక మండపం వద్ద వ్యాసరచన పోటీలో విజేతగా నిలిచిన సూరంపల్లి వైష్ణవికి అసోసియేషన్ సభ్యులు సైకిల్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, మండల నాయకుడు మల్లేశ్ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: తెలుగు అధ్యాపకులను సన్మానించిన పరమేశ్

తెలంగాణ భాష గొప్పతనం చాటిన మహనీయుడు

తుర్కయంజాల్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కాలోజీ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ భాష, యాస గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు కాళోజి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ భిక్షపతి, ఏఈఈ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత, ఆర్ఐ వినయ్ తదితరులు పాల్గొన్నారు.


మాడ్గుల: కేజీబీవీలో నివాళి అర్పిస్తున్న ఎస్ఓ రేఖ, ఉపాధ్యాయులు

కేజీబీవీలో..

మాడ్గుల: మండల పరిధిలో మంగళవారం తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో కాళోజీ చిత్రపటానికి ఎస్ఓ రేఖ, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళి అలర్పించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ.. కాళోజీ తన కవిత్వం, రచనలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో విజయవంతం చేయాలి

ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి మల్లేశ్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటో గ్రాఫర్స్

ఆమనగల్లు: ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో విజయవంతం చేయాలని ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో అసోసియేషన్ సభ్యులతో కలిసి ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. నగరంలోని నార్సింగిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సత్యం, సభ్యులు శ్రీశైలంయాదవ్, యాదగిరి, అలీం, శివ, గణేశ్, శ్రీకాంత్, రఫీ తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారి రమేశ్, సభ్యులు శేఖర్, రవూఫ్, శ్రీనివాస్, శ్రీకాంత్, కిషన్, వేణు, విజయ్, ఆంజనేయులు, గిరి, మహేశ్, కిరణ్, సాయి, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కీమోథెరపీ యూనిట్ ప్రారంభం



కీమోథెరపీ యూనిట్ ప్రారంభోత్సవంలో వైద్యులు

వనస్థలిపురం: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మంగళవారం వర్చువల్‌గా అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డేకేర్ కీమోథెరపీ యూనిట్లను ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా పరిధి వనస్థలిపురంలోని మహేశ్వరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్లు డా.నాగేందర్, డా.కృష్ణ పది పడకల కీమోథెరపీ, అదనంగా పది పడకల పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాన్సర్ బాధితులు మొదట నగరంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకుని చికిత్స తర్వాత, రెండవసారి నుంచి స్థానికంగా ఉన్న ఆసుపత్రులలో కీమోథెరపీ సేవలు పొందవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 266 మంది క్యాన్సర్ రోగులను వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి అలాట్‌మెంట్ చేయడం జరిగిందని అలాగే పక్షవాతం రోగులకు పాలియేటివ్ కేర్ సెంటర్‌లో చికిత్స నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డా.జయమాల, డా.రాజ్‌కుమార్, జనరల్ సర్జరీ, అనస్థీషియా, మెడికల్, నర్సింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.